www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 28 నవంబర్ 2024

5

తుపాను నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - అయినవిల్లి

తుపాను కారణంగా ఈ నెల 28 నుంచి వచ్చే నెల 2తేదీ వరకు భారీ వర్షములు కురిసే అవకాశము ఉన్నందున అయినవిల్లి తహశీల్దార్ కార్యాలయంలో 9491575700 నెంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తహశీల్దార్ నాగలక్ష్మమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇది రైతులకు 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. తుపానుకు సంబంధించిన సమచారం, ఇతర సమస్యలపై కంట్రోల్ రూమ్‌ను సంప్రదించొచ్చన్నారు. తుపాను నేపథ్యంలో రైతులు అందరూ వరి కోతలను తాత్కాలికంగా నిలిపేయాలని తెలిపారు. ఏవైనా అనుమానాలు ఉంటే అందుబాటులో గల రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి వారి సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. .

రైతుల గుండెల్లో వణుకు

- తుపాను ప్రకటనతో ఆందోళన
- కళ్లాల్లోనే 70 శాతం ధాన్యం

వాతావరణ శాఖ తుపాను ప్రకటనతో రైతుల గుండెల్లో వణుకు మొదలైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడి తుపానుగా మారింది. దీన్ని ప్రభావం వల్ల ఇప్పటికే జిల్లాలో వాతావరణం మారిపోయింది. ఇంకా పంట కళ్లాల్లోనే ఉండటంతో అన్నదాతల్లో కలవరం మొదలైంది. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

ప్రజాశక్తి - రాజోలు, ఉప్పలగుప్తం, రాజమహేంద్రవరం రూరల్

బంగాళాఖాతంలో ఈ నెల 24న అల్పపీడనం ఏర్పడింది. ఇది క్రమంగా బలపడి తుపానుగా మారింది. దీని ప్రభావంతో బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంది. తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. బుధవారం అర్ధరాత్రి నుంచి తుపాను ప్రభావం ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో అన్నదాతల్లో అందోళన నెలకొంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 5 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేశారు. 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం కోతలు జరుగుతున్నాయి. చాలా వరకూ పంట కళ్లాలోనే ఉంది. సుమారు 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా రైతుల వద్దే ఉంది. వీటిని పొలాల్లో, రోడ్ల చెంతనే ఉంచారు.

ధాన్యాన్ని మూటలుగా కడుతున్న కూలీలు

పంటను కాపాడుకునేందుకు బరకాలను కప్పుతున్న రైతులు

హడావుడిగా వరి కోతలు

వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ఊపందుకున్నాయి. వరికోత మిషన్లతో రైతులు హడావుడిగా కోతలను నిర్వహిస్తున్నారు. దీంతో వరికోత మిషన్లకు డిమాండ్ పెరిగింది. ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో కోత యంత్రాలు పని చేస్తున్నాయి. ఒక యంత్రం రోజుకు 10 నుంచి 12 ఎకరాల్లో వరి కోత కోస్తోంది. ప్రస్తుతం వరికోతలు ఆపాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కోతలు ప్రారంభిస్తే వర్షాలకు తడిపి ధాన్యం పాడయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ బుధవారం సాయంత్రం వరకూ కోతలను కోసి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. చాలా చోట్ల రైతులు కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి

తుపాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి కోతలను వాయిదా వేసుకోవాలి..కోత యంత్రాలు అందుబాటులో ఉంటే ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుని పచ్చి ధాన్యాన్ని నిల్వ చేయ కుండా మార్కెట్ చేసుకోవాలి. ధాన్యం తరలింపులో ఏమైనా ఇబ్బందులుంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. డిసెంబర్ 2 వరకు వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రైతులు అప్రమత్తంగా ఉండాలి.

- విఎస్ దివాకర్,తహశీల్దార్, ఉప్పలగుప్తం

నేలవాలితే నష్టమే...

వరి కోత దశలో వర్షాలొస్తే నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే కొన్నిచోట్ల నేలవాలిన పంటపై చినుకులు పడితే ధాన్యం మొలకలొచ్చే అవకాశం ఉంది. తుపాను గాలి వల్ల వర్షం పడి ఆగిపోతే పెద్దగా నష్టం ఉండదు. గాలి వేగం ఎక్కువగా ఉంటే పంట నేలవాలిపోతుంది. దీనివల్ల మొలకలొస్తాయి. యంత్రంతో కోత కోయడానికి ఎక్కువ సమయం పడుతుంది.

సూచనలు పాటిస్తే..

కోతకు వచ్చిన పంటను వెంటనే నూర్పిడి చేయాలి.

కోతకు ఇంకా సమయం ఉంటే పొలంలో బాటలు చేసుకుని నీరు బయటకు వెళ్లేలా చూడాలి.

బాటలు చేయడం వల్ల గాలికి పంట చిందరవందరగా పడిపోకుండా ఉంటుంది.

వర్షపు నీరు పొలంలో నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఉప్పలగుప్తంలో వరికోత యంత్రంతో వరికోతలు

సామర్లకోటలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి

ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి

సామర్లకోటలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి ప్రచారం

ప్రజాశక్తి - సామర్లకోట, కాకినాడ, యు.కొత్తపల్లి

ప్రభుత్వ విద్యను మరింతగా బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, అయోధ్య రాంపురం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు నరవ సురేష్, డివైఎఫ్ఐ నాయకులు కె.తులసిదాస్, డివి.లక్ష్మణ్, ప్రజాసంఘాల నాయకులు దారబాని కృష్ణ బి.శ్రీను, డి.సింహాచలం పాల్గొన్నారు.

కాకినాడలో మాజీ ఎంఎల్‌సి ప్రచారం

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి మద్దతుగా కాకినాడ నగరంలోని పిఆర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు కెఎంఆర్.ప్రసాద్, యుఎస్ఎన్.రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.గంగసూరిబాబు, డి.ఆదర్శ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లిలో సిఐటియు ప్రచారం

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి మద్దతుగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు యు.కొత్తపల్లి మండలంలో ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలో పలు పాఠశాలలను సందర్శించిన ఆయన ఉపాధ్యా యులను కలుసుకుని గోపిమూర్తికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు, సిహెచ్. సాంబశివరావు, జి.శ్రీనుపాల్గొన్నారు.

పెద్దాపురంలో గోపిమూర్తి ప్రచారం

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపి మూర్తి పెద్దాపురం మండల పరిధిలోని వడ్లమూరు, చంద్రమాంపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అన్నా రామ్, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రభాకర్ వర్మ పాల్గొన్నారు.

కాకినాడలో ప్రచారం చేస్తున్న మాజీ ఎంఎల్‌సి

యు.కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

మాట్లాడుతున్న రహంతుల్లా

పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తూర్పు గోదావరి జిల్లా కోర్టు ఆదేశాల మేరకు బుధవారం బాల్య వివాహ ముక్తి భారత్ కార్యక్రమంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటి చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా మాట్లాడుతూ డపిల్లలంతా విద్యావంతులయినప్పుడే బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. ఆధునిక కాలంలోను బాల్య వివాహాలు అక్కడక్కడా జరుగుతుండటం మంచి పరిణామం కాదని, బాల్య వివాహాలు జరిపినా, జరిగినట్లు తెలిసినా సంబంధిత అధికారులకు సమాచారమిచ్చి, అడ్డుకట్ట వేసేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థినిలు విద్యార్థి దశలో లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకునే దిశగా ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. గురువులు, తల్లిదండ్రుల సలహాలు సూచనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు దాసరి సత్య నారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.పరిమళ, పోలీసు సిబ్బంది, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు

ప్రజాశక్తి - అల్లవరం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు అన్నారు. బుధ వారం కోడూరుపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్పపీడనం కారణంగా ఈ నెల 29వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు వర్షాలు కురుస్తాయన్నారు. ఈ కారణంగా ప్రస్తుతం నిలబడి ఉన్న వరి పంటను కొయ్యవద్దు అని, కళ్లాల్లో ధాన్యం రాసులు లేకుండా చూసుకోవాలన్నారు. ఆరబెట్టిన ధాన్యం ఉంటే ధాన్యం కొనుకోలు కేంద్రాల ద్వారా వెంటనే దగ్గరలో ఉన్న రైస్ మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో ఉన్న వ్యవసాయ సిబ్బంది అందరు రైతులను అప్రమత్తం చేయాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 172 ఎకరాల్లో వరి కోతలు పూర్తి అయ్యాయన్నారు. కార్యక్రమంలో అల్లవరం మం డల వ్యవసాయ శాఖ అధి కారి ఎన్‌వి వి.సత్యనారాయణ, వ్యవసాయ విస్తర్ణ అధికారి ఎం.శుభగణేష్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు బి.శ్రావణి, రైతులు కొక్కిరిమెట్టి తాతాజీ, కొక్కిరిమెట్టి సూరిబాబు, పిల్ల సూర్యనారాయణ, వాసం శెట్టి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న బోసుబాబు

మామిడికుదురు: వాయుగుండం ప్రభావంతో ఈనెల 28 నుంచి ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పంటల సంరక్షణ చర్యలపై అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి బోసు బాబు సూచించారు. బుధవారం మండల వ్యవసాయాధికారిణి బి మదుల క్షేత్రస్థాయి వ్యవసాయ సహాయకులతో చర్చించారు. రైతులకు అందుబాటులో ఉండి పంటల సంరక్షణపై సూచనలు సలహాలతో అవగాహన కల్పించాలన్నారు తేమశాతం ఎక్కువగా ఉన్న వరిపనలు కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పలు వేస్తే పంట నష్టము తగ్గించుకోవచ్చన్నారు తరువాత ఆరబెట్టుకోవచ్చని సూచించారు ఈదురు గాలులకు పంట నేలకు ఒరిగిపోతే మురుగనీరు మళ్లించి ఉప్పు ద్రావణం పిసికారి చేయాలన్నారు.

కొత్తపేట అసిస్టెంట్ ఎజిపిగా విద్యాప్రసన్న

ప్రజాశక్తి - కొత్తపేట/ఆలమూరు

కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఆలమూరు కోర్టు ఎజిపిగా పనిచేస్తున్న బూసి విద్యా ప్రసన్నకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. విద్యా ప్రసన్నను కొత్తపేట కోర్టు ఎజిపిగా (ఇంచార్జ్) బాధ్యతలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వి.మదన్‌మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలమూరు కోర్టు ఎజిపితో పాటు కొత్తపేట కోర్టు అసిస్టెంట్ఎజిపిగా నియమితులైన విద్యా ప్రసన్నను పలువురు అధికారులు, నాయకులు అభినందించారు. ప్రసన్న మాట్లాడుతూ పేదలకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. దీంతో విద్యా ప్రసన్న చేస్తున్న సేవలను కొనియాడుతూ పలువురు అభినందనలు తెలియజేశారు.

సంఘ సంస్కర్తల ఆశయ సాధనకు కృషి

కార్మిక శాఖ మంత్రి సుభాష్

ప్రజాశక్తి - పి.గన్నవరం

ప్రముఖ సంఘ సంస్కర్తలు మహాత్మ జ్యోతిరావు పూలే,దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాల సాధనకు కృషి చేయాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆయన మహాత్మ జ్యోతిరావు పూలే, దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. పి.గన్నవరం మండలం నరేంద్రపురంలోని బల్లవంతెన దగ్గర ఏర్పాటు చేసిన శెట్టి బలిజ వన సమారాధన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని బుధవారం మాట్లాడారు. శెట్టిబలిజ జాతి కోసం అహర్నిశలు కృషి చేసిన దొమ్మేటి వెంకట రెడ్డి, మహాత్మ పూలే వంటి మాహనీయుల విగ్రహాలను తన చేతుల మీదుగా ఆవిష్కరించడం పూర్వజన్మ సుకృతమన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవలను మంత్రి సుభాష్ కొనియాడారు.

నరేంద్రపురంలో జ్యోతిరావు పూలే, దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాల ఆవిష్కరణలో మంత్రి సుభాష్, ఎంఎల్ఎ గిడ్డి

సమాజంలో సామాజిక మార్పులు తెచ్చేందుకు మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన సేవలు నేటి యువతకు ఆదర్శమని మంత్రి శుభాష్ పేర్కొన్నారు. కార్యకమంలో ఎంఎల్‌సి కుడిపూడి సూర్య నారాయణరావు, పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్య నారాయణ, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, సంఘ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, దొంగ శ్రీను, కుడిపూడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఆటల పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - ఐ.పోలవరం

మండలంలోని జి.వేమవరం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న జెడ్‌పిపి హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో జాతీయస్థాయిలో ఆటల పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 22 నుంచి 24 వరకు చిత్తూరు జిల్లా అరకొండలో జరిగిన 68 వ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ అండర్-14 బాలికల విభాగం నుంచి జి.వేమవరం ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్.అనన్య, ఎం.ఝాన్సీ శ్రీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనారని హైస్కూల్ హెచ్ఎం సలాది వెంకటనారాయణ తెలియజేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు ఫిబ్రవరిలో గుజరాత్ లో జరిగే పోటీల్లో పాల్గొంటారని అన్నారు. జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పీడీ జి.కళావతి, పిఇటి ఎ.నాగ రాంప్రసాద్‌ను ఎస్ఎంసి చైర్మన్ బసవ అప్పారావు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ అప్పారావు,ఉపాధ్యాయులు

.11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిధి గ్రామాల్లో ఇప్పటివరకు 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని మండల వ్యవసాయ అధికారిని ఎస్.లక్ష్మీ లావణ్య తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని జొన్నాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. అలాగే తుఫాను హెచ్చరిక ఉన్నందున ఇంకా కోతలుకోయని రైతులు డిసెంబర్ 2 వరకు వాయిదా వేసుకోవాలని కోరారు.

చైర్మన్ పాపారావును సన్మానిస్తున్న నాయకులు

రాష్ట్ర అగ్నికుల క్షత్రియ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రాష్ట్ర అగ్నికుల క్షత్రియ చైర్మన్ చిలకలపూడి పాపారావు ను బుధవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. పాపారావు బాపట్ల జిల్లా రేపల్లి మండలం మాలాంకివాణి గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఇప్పటి వరకు సర్పంచుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారు. ఆయనను కలిసి అభినందనలు తెలిపిన వారిలో నాయకులు కరాటం ప్రవీణ్, పెనుమల ఏడుకొండలు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కార్టూ'నిజం'



విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - అమలాపురం

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం బి-1245 టిఎన్‌టియుసి అనుబంధ సంస్థ గత 40 సంవత్సరాల నుండి కార్మికుల సమస్యల పరిష్కారానికి విశేష కషి చేస్తోందని డిస్కమ్ కార్యదర్శి బివి రవీంద్ర డిస్కమ్ అడిషనల్ సెక్రటరీ ఎం.గణేష్ అన్నారు. అమలాపురం స్థానిక వాసర్ల వెంకన్న గార్డెన్స్ లో జరిగినటువంటి జిల్లా కార్యవర్గ సమావేశంలో వివిధ యూనియన్ ల నుంచి 50 మంది సభ్యులు తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘంలో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సమావేశంలో విద్యుత్ కార్మికులకు సంబంధించి పలు అంశాలు చర్చించారు. జెఎల్ఎం-2 కార్మికులందరినీ కూడా సంస్థలో విలీనం చేసే విధంగా కషి చేస్తామని, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్‌ను విడతల వారీగా సంస్థ నందు విలీనం చేసే విధంగా కషి చేస్తామని, ఇపిఎఫ్ టు జిపిఎఫ్ సాధిస్తామని, అదే విధంగా ప్రస్తుతం ఉన్న మెడికల్ పాలసీని రద్దు చేసి మెరుగైన అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీ వచ్చే విధంగా కషి చేస్తామని తెలుగు యూనియన్ హామీ ఇచ్చింది. గత ప్రభుత్వం నందు ఏదైతే కార్మిక వ్యతిరేక నిర్ణయాలు ఉన్నాయో వాటిని విద్యుత్ శాఖ మంత్రి, సెక్రటరీ తో సమీక్షించి ఏదైతే పాత పద్ధతిలో 1999 ట్రై పార్టీ అగ్రిమెంట్ ప్రకారం ఎపి పవర్ యుటిలిటీస్ అన్నిట్లో కార్మికుల శ్రేయస్సు కార్మికులకు సంబంధించి విద్యుత్ రంగ సంస్థలన్నీ కూడా ఒకే విధానాన్ని అవలంబించే విధంగా చూస్తామని తెలిపింది. ఇవన్నీ కూడా తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకత్వంలో సమీక్షించి మేనేజ్మెంట్‌తో డిస్కస్ చేసి రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ మంత్రి తో మాట్లాడిపై సమస్యలను కూడా త్వరిత గతిన అమలు జరిగేటట్టు చూస్తామని, కార్మికులకు అభ్యున్నతి కి తెలుగునాడు యూనియన్ హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో స్టేట్ కార్యవర్గ సభ్యులు ఆర్.సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి. సురేష్, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన తెలుగు నాడు విద్యుత్తు కార్మిక సంఘం

తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక

జిల్లా తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం అమలాపురం వాసర్ల గార్డెన్ నందు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వారి అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమం ఎపి ఇపిడిసిఎల్ కార్యదర్శి బొబ్బరవీంద్ర హాజరయ్యారు. కార్యక్రమానికి అమలాపురం డివిజన్ 327 సభ్యులు సుమారుగా 50 మంది తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘంలో చేరారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా భారతి వెంకటేశ్వరరావు, ఎం.గణేష్ కుమార్‌ను, కార్యవర్గ సభ్యులుగా దేవదాస్ రమేష్ ,కుడుపూడి బాలాజీ, బడుగు రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గురుకుల విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

ప్రజాశక్తి - అల్లవరం

గోడి గురుకుల బాలుర పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఐటి మరియు ఐటిఇఎస్ ఒకేషనల్ కోర్సులు భాగంగా 9, 10, 11,1 2 తరగతి విద్యార్థులు భట్లపాలెంలో బివిసి ఇంజినీరింగ్ కళాశాలకు ఇండస్ట్రియల్ విజిట్ లో భాగంగా బుధవారం హాజరయ్యారని ప్రిన్సిపల్ నక్క శ్రీనివాస్ తెలిపారు. ఈ సంద్భంగా ఐటి ట్రయినర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు వత్తి విద్యా నైపుణ్యం పెంపొందించేందుకు ఈ విజిట్ లు ఉపయోగపడతాయన్నారు. బివిసి ఇంజినీరింగ్ కళాశాల లోని ఐటి ల్యాబ్స్, ఇంజినీరింగ్ ల్యాబ్స్ వాటి పనితీరును కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెవిజి.రామారావు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే లింగ వివక్షత నిర్మూలన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రతి ఒక్కరూ విద్యావంతులయినప్పుడే లింగ వివక్షను నిర్మూలించవచ్చునని మండల పరిషత్ అభివద్ధి అధికారి వెంకటాచారి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండర్ ఆధారిత హింస వ్యతిరేక జాతీయ ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం చేపట్టిన ప్రచారాన్ని వెంకటా చారి ప్రారంబించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులైనప్పుడే లింగ వివక్షలు తొలగుతాయని, దీనిని సాకారం చేసేందుకు అంకితభావంతో పని చేద్దామని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి ఎ ఎన్ శ్రీనివాస్, వెలుగు ఎపిఎం ఆర్‌వి. రమణతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

68 వ అంతర జిల్లాల అండర్ -14 బాలుర క్రికెట్ టోర్నమెంట్ ఎంపికలకు సంబంధించి బుధవారం డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా వ్యాయామ ఉపాధ్యాయులను సమావేశపరిచి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజరాజేశ్వరి, పాఠశాల సిబ్బందికి కమిటీ వారందరికీ కూడా బాలయోగి క్రీడా ప్రాంగణం కిమ్స్ క్రీడా ప్రాంగణం జడ్‌పి ఉన్నత పాఠశాల బాలుర క్రీడ ప్రాంగణంలోని ఇన్చార్జిలకు తగు సూచనలు ఇచ్చి నేటి నుండి మూడు రోజులు జరగబోవు క్రికెట్ పోటీలలో ఏ విధమైన లోటుపాట్లు లేకుండా చూడాలని కమిటీలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎసిజిఎఫ్ సెక్రటరీ అడబాల విజయ్ శ్రీనివాస్ హెచ్ ఎం అసోసియేషన్ సెక్రటరీ విత్తనాల శ్రీనివాస్, రావులపాలెం మండల విద్యాశాఖ అధికారి రేలంగి నాగ కుమార్, ప్రధానోపాధ్యాయులు భమిడిపాటి రామకష్ణ, గౌరీశంకర్ వ్యాయామ ఉపాధ్యాయ అధ్యక్షులు చొల్లంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాము కాటుతో రైతు మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతును పాము కాటు వేయడంతో మృతి చెందాడు. బుధవారం మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన పైన్ని వీర వెంకట సత్యనారాయణ (58) రోజు మాదిరిగానే పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో అతనిని హుటాహుటిన సామర్లకోట ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అతను పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ సంఘటనపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

38 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎక్సైజ్ అధికారులు బుధవారం మండలంలో నిర్వహించిన దాడుల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ తెలిపారు. కరప మండలం పెద్దాపురపాడు గ్రామానికి చెందిన యాళ్ళ శంకర్, వాసంశెట్టి సత్యనారాయణ అనే వ్యక్తులతో పాటు మద్యం రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గోవిందపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సా రా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్ రావు తెలిపారు. అలాగే సూరంపాలెం గ్రామంలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

కులంపేరుతో దూషించిన కేసుపై విచారణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక యువతితో గొడవపడి కులం పేరుతో దూషించిన కేసులో బుధవారం కొత్తపేట డిఎస్‌పి వై.గోవిందరావు కేసుకు సంబంధించి పలువురిని విచారించారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామానికి చెందిన మద్దాల నిరీక్షణ ఆత్రేయపురం గ్రామం కాలువ రేవు సెంటర్లో ఉన్న స్వామి పూతరేకులు షాపులో పనిచేస్తోంది. ఈ నెల 5న నిరీక్షణ పనిచేయుచున్న సమయంలో పక్క షాపులో ఉన్న చింతా మారియ్య వచ్చి పూతరేకుల వ్యాపారం విషయంలో ఆమెతో గొడవ పెట్టుకుని కులం పేరుతో దూషించాడు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి డిఎస్‌పి వై.గోవిందరావు సంఘటన స్థలంలో మరియు స్థానిక స్టేషన్లో సాక్షులను పిలిచి పలు వివరాలను సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని వేమగిరి 216వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థిని మృతి చెందినట్టు ఎస్ఐ బి.నాగదుర్గా ప్రసాద్ తెలిపారు. వేమగిరి గట్టు ప్రాంతానికి చెందిన కల్లా దుర్గ ఆమె మేనకోడలు పితాని రూపాదేవి(18)తో కలిసి స్కూటీపై డిగ్రీ పరీక్షలు రాయించేందుకు వేమగిరితోట నుంచి రాజమహేంద్రవరం వెళ్తుండగా, వేమగిరి సెంటర్ వద్ద రాజమహేంద్రవరం వైపు తిరుగుతుండగా రావులపాలెం వైపు నుండి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ప్రైవేట్ కాలేజీ బస్సు స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీ అదుపుతప్పి కింద పడిపోవడంతో వెనక కూర్చున్న రూపాదేవి మీద నుండి బస్సు వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా రూపాదేవి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఎస్ఐ వెల్లడించారు.

8న జాతీయ ఉపకార వేతన పరీక్ష

- మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 13 పరీక్షా కేంద్రాలను కేటాయింపు
- కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిసెంబర్ 8వ తేదీ ఆదివారం జాతీయ ఉపకార వేతన పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు ఉపకార వేతన పరీక్ష రాసేందుకు 2, 815 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. వీరికి మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 13 పరీక్షా కేంద్రాలను కేటాయించినట్లు ఆయన తెలిపారు. డిసెంబర్ 8 వ తేదీ ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ జాతీయ ఉపకార వేతన పరీక్ష నిర్వహిస్తారని అన్నారు. ఈ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థిని విద్యార్థుల యొక్క హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచా లకుల కార్యాలయపు www.bse. ap.gov.in నందు స్కూల్ లాగిన్ లో అందుబాటు లో ఉంచారన్నారు. సంబంధి త పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు పాఠశాల U-DISE కోడ్ ను ఉప యోగించి లాగిన్ అయి తమ పాఠశాలకు సంబం ధించిన విద్యార్థుల యొక్క హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసి విద్యార్థులకు అందజే యాలని కలెక్టర్ ఆ ఆదేశిం చారు. అమలాపురం రెవెన్యూ డివిజన్లో 1,239 మంది, రామచంద్రపురంలో రెవెన్యూ డివిజన్లో 712 మంది, కొత్తపేట రెవెన్యూ డివిజన్ లో 864 మంది వెరసి 2,815 విద్యార్థులు పాల్గొననున్నారన్నారు. అమలాపురం రెవిన్యూ డివిజన్లో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. వీటిలో జడ్‌పి బాలికల హై స్కూల్ సూర్యనగర్ అమలాపురం, జడ్‌పి బాలుర హైస్కూల్ సూర్యనగర్ అమలాపురం, ఎంజి మున్సిపల్ హైస్కూల్, వి.అగ్రహారం అమలాపురం, జె ఎన్ మున్సిపల్ హైస్కూల్ కొంకాపల్లి అమలాపురం, విద్యా నిధి ఐఐటి స్కూల్ అమలాపురం, జడ్‌పి. హెచ్ఎస్, పేరూరు అమ లాపురం,


కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

కొత్తపేట రెవెన్యూ డివిజన్లో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు, వీటిలో గవర్న మెంట్ బాలుర ఉన్నత పాఠశాల కొత్తపేట, భాష్యం ఇంగ్లిష్ మీడియం స్కూల్ కొత్తపేట, కాంతి భారతి జూనియర్ కాలేజ్ కొత్తపేట, జడ్‌పి హైస్కూల్ వాడపాలెం కొత్తపేట మం డలం, రామచంద్రపురం రెవెన్యూ డివిజన్లో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పా టు చేశార న్నారు. వీటిలో ఎం పి ఎల్ ఉన్నత పాఠశాల రత్నంపేట రామచంద్రపురం, ఎస్‌కెపిజిఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామచంద్రపురం, ఎస్ఐ జిఎంపిఎల్ ఉన్నత పాఠశాల చాకలిపేట రామచంద్రపురంలో ఏర్పాటు చేశార న్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పరీక్షలు నిర్వహణకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాలలో వసతుల కల్పన, పోలీస్ యంత్రాంగం సహకారంతో శాంతి భద్రతల నడుమ పరీక్షలు నిర్వహణ పర్యవేక్షణ ఏర్పాట్లను కొరకు అధికా రులకు విధులు బాధ్య తలు కేటాయించామని డిఇఒ షేక్ సలీం బాషా ఆ ప్రకటనలో తెలిపారు.

వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం వాడివేడిగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. పట్టణంలో మున్సిపల్ సర్కులర్ బజార్ లో ఉన్న దుకాణాలు సబ్ లీజులు కు ఇచ్చేస్తున్నారనీ మున్సిపల్ ఆవరణలో వున్న మీ సేవ బిల్డింగ్ అద్దెకు తీసుకున్న కాంట్రాక్టర్‌కు లబ్ది చేకూర్చే విధంగా చేస్తున్న వైఖరి సరైనది కాదంటూ ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయల్ మున్సిపల్ కమిషనర్ రాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎంఎల్‌సి ఇజ్రాయిల్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ చేసుకునే వ్యాపారానికి రూ.9 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ వేయడం కుదరదు మీరు అతని తో కుమ్మక్కు అవుతున్నారు అంటూ కమిషనర్ రాజు పై ఎంఎల్‌సి బొమ్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ రాజు తీరుపై టిడిపి, , జనసేన కౌన్సిలర్లు మండి పడ్డారు. ప్రయివేటు సంస్థకు చెందిన వ్యాపారానికి రూ.9 లక్షల విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఎలా జరిగిందని మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్ర మణిని కౌన్సిలర్లు ప్రశ్నించారు. పట్టణం లో వున్న 30 ఐరన్ డస్ట్ బిన్లలో చాలా వరకు దొంగిలించారనీ ఎన్ని డస్ట్ బిన్ లు ప్రస్తుతం వున్నాయో అసలు మీకు తెలుసా అని టిడిదపి సీనియర్ కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి మండిపడ్డారు. అమలాపురం సర్కులర్ బజార్లో రూ.లక్షల్లో బకాయిలు వున్నారు. వారికి షాప్ లు మరో మూడేళ్ళ పొడిగించడం కుదరదు. వాటిని రద్దు పరచండి. బోగస్ యజమానులను తొలగించండి. అని జనసేన పార్టీ కౌన్సిలర్లు కమిషనర్ ను కోరా. ఈ .కార్యక్రమంలో టిడిపి, వైసిపి, జనసేన పార్టీ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి

అవకతవకలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ, జనరేటర్ ఏర్పాటు

అమలాపురం మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న మీసేవ బిల్డింగ్ ను పట్టణానికి చెందిన కాంట్రాక్టరు ఒకరు లీజుకు తీసుకుని దానిని పేరుగాంచిన కెఎఫ్‌సి రెస్టారెంట్ వారికి సబ్ లీజుకు ఇచ్చారు. అయితే మున్సిపాలిటికి ఏవిధమైన సంబంధంలేని కెఎఫ్‌సి రెస్టారెంట్ వారు మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని వెహికిల్ పార్కింగ్ షెడ్డులో జనరేటర్ ఏర్పాటు చేసుకోవడంతో పాటు మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ట్రాన్స్ ఫార్మర్ దిమ్మ నిర్మించు కున్నారు. మున్సిపల్ అధికారులు కెఎఫ్‌సి వారికి వత్తాసు పలకడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటికి వివిద రకాల పన్నులు కడుతున్నానని, అదేవిధంగా చేసిన వర్కులకు మున్సిపాలిటీ నుంచి రూ.కోట్లాది బిల్లులు రావాల్సి ఉందని ఇంటి దగ్గర పార్కింగ్ లేని కారణంగా తన కారును కూడా మున్సిపల్ ఆవరణలో వెహికల్ షెడ్డులో పెట్టుకునే అవకాశం కల్పించాలని కాంట్రాక్టర్ అరిగెల బాబి మున్సిపల్ కమీషనర్ కు లేఖ రాశారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్స్ తమ వృత్తిలో బాధ్యతాయుతంగా పనిచేస్తూ ఆదర్శంగా నిలవాలని ఎంపిడిఒ ఎ.రాజు పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో వీక్లీ రివ్యూ మీటింగ్ లో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్స్ తో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామాల వారీగా గుర్తించిన పనుల పైన, జరుగుతున్న అభివృద్ధిపైన ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. కూలీల మస్తర్లను ఎప్పటికప్పుడు రోస్టర్‌లో నమోదు చేసుకుంటూ రికార్డు రూపంలో సంబంధిత శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. విధుల్లో ఎవరు అలసత్వం వహించవద్దని బాధ్యతగాపనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ ఎం.మెహర్ ప్రకాష్, ఎపిఒ జి.అరుణకుమారి, కన్సల్టెంట్ ఇంజినీర్ పి.ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున ఎంపిడిఒ రాజు

యానాం వార్తలు

బంగారు పతకం సాధించిన శ్రీవేద విద్యార్థి

ప్రజాశక్తి - యానాం

ఆంధ్రప్రదేశ్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో శ్రీ వేద పబ్లిక్ స్కూల్ విద్యార్థి కర్రి జశ్వీర్ బంగారు పతకాన్ని సాధించాడని ఛైర్మన్ గుత్తుల గోవిందజయ రామారావు, డైరెక్టర్స్ నీతూ, అర్జున్ బుధవారం తెలిపారు. ఈ నెల 25న రామచంద్రపురంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో నాలుగో తరగతి విద్యార్థి కర్రి జశ్వీర్ విశేష ప్రతిభను కనబరిచాడన్నారు. అలాగే యానాంలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మిడిల్ విభాగంలో మొదటి బహుమతిని శ్రీవేద స్కూల్ విద్యార్థి కాళ్ళ భానుతేజ గెలుచుకున్నాడన్నారు. వీరిద్దరిని పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, విద్యాశాఖాధికారి పి.లక్ష్మణప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకరరావు, శ్రీ వేద స్కూల్ ఛైర్మన్ గుత్తుల గోవింద జయ రామారావు, డైరెక్టర్స్ నీతూ, అర్జున్ అభినందించారు.

యాంటీ బయోటిక్స్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - యానాం

యానాం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో యాంటీ బయాటిక్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ యాంటీబయోటిక్స్‌ను సొంతంగా వినియోగించకూడదన్నారు ఒకరికి రాసిన యాంటీబయోటిక్స్ మందులను వేరొకరికి వినియోగించకూడదని, ఎక్కువగా వినియోగించడం వల్లఉత్పన్నమయ్యే సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ అధికారి డాక్టర్ టి.రవిశంకర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి - యానాం

యానాం సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌పై రెయ్యా శ్రీనివాస్‌ను నియమిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన స్థానిక ఉమెన్ అండ్ ఛైల్డ్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈయన ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై వచ్చి సబ్ రిజిస్ట్రార్ సేవలందిస్తున్న నరేంద్రకుమార్‌ను తిరిగి ఆయన సొంతశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.


వేడుకల్లో పాల్గొన్న నాయకులు తదితరులు

ఘనంగా బ్రూస్లీ జయంతి

ప్రజాశక్తి - ఆలమూరు

కొత్తూరు సెంటర్ రైస్ మిల్లు వద్ద కుంగ్ ఫు గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు బందం ప్రపంచ వీరుడు బ్రూస్ లీ 84వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు టిడిపి మండల సీనియర్ నాయకులు సలాది నాగేశ్వరరావు, పినపల్ల సర్పంచ్ సంగీత సుభాస్, మాజీ సర్పంచ్ గుంటూరు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉచిత కుంగ్ ఫు, కరాటే, టైక్వాండో బాక్సింగ్ క్లాసులను నేతలు ప్రారంభించారు. అనంతరం బ్రూస్లీ జయంతి సందర్భంగా కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంఇఎఫ్ ప్రధాన కార్యదర్శి కూడేలి సురేష్, జనసేన పార్టీ నాయకులు చల్లా బాబి, కరాటే మాస్టర్లు లంకె వెంకటరెడ్డి, ఎం సుధాకర్, వంగలపూడి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక సంత మార్కెట్‌లో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు, గ్రూపులు తయారు చేసిన పలు ఉత్పత్తులను అర్బన్ మార్కెట్లో విక్రయానికి ఉంచారు. మహిళలను ఆర్థికంగా ఆదుకునే దిశగా ఈ మార్కెట్ ను ఏర్పాటు చేసినట్లు మెప్మా సిఎంఎం హుస్సేన్ తెలిపారు. వస్త్రాలు, తినుబండారాలు, అల్లికల వస్తువులు, డ్రై ఫ్రూట్స్ తదితర స్టాల్స్ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మెప్మా సిఇఒలు ప్రసాద్‌బాబు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

జెఎన్‌టియుకెలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్‌సిసి 18వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా జెఎన్‌టియుకెలో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు కళాశాలలకు చెందిన ఎన్‌సిసి క్యాండెట్స్, జెఎన్‌టియుకె విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు రామారారావు పేట హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మేనేజర్ చంద్రబాబు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ కె.మొహమ్మద్ ఆసిఫ్ మేజర్ హేమంత్‌కుమార్, సుబేదార్ గురేందర్‌సింగ్, సుబేదార్ డి.గణేషన్, హవల్దర్ రఫిక్ జానీ, హవలదర్ సునీల్ కుమార్, జి గోపాల్, హవల్దార్ సురేష బాబు, హవల్దార్ బికాస్ గురున పాల్గొన్నారు.

కోరుకొండ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ షష్టిలో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాల పోస్టర్‌ను షష్టి కమిటీ అధ్యక్షుడు ఉల్లి వీరభద్ర సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ షష్టి ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి లక్ష్మీ సరోజ గణేష్, బదిరెడ్డి సత్యనారాయణమూర్తి, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, కేతినీడి అశోక్, ఉల్లి కాశీ, నీరుకొండ బాబ్జీ, కటకం చలం పాల్గొన్నారు.

1న బాలలు కథా రచన పోటీలు

ప్రజాశక్తి - ఆలమూరు

రాజమహేంద్రవరం ఎస్‌కెవిటి హైస్కూల్ వేదికగా వచ్చే నెల 1న నిర్వహించనున్న బాలల కథా రచన పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని బాల మందిరం అధ్యక్షుడు అంగర గోపాలకృష్ణాచార్యులు పిలుపునిచ్చారు. బుధవారం సంధిపూడి హైస్కూల్లో ఆయన బాలల కథా రచన పోటీలు 2025 పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల మందిరం, గోదావరి బాలోత్సవం సంయుక్తంగా నిర్వహిస్తున్న కథల పోటీల గురించి వివరించారు. చిన్నారుల్లో సృజనాత్మకతను, ఊహాశక్తిని పెంపొందించడానికి కథలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. 4వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు తాము సొంతంగా రాసిన కథలు గాని, సేకరించిన కథలు గాని ఆయా విభాగాల్లో జరిగే పోటీల్లో రాయవచ్చని తెలిపారు. స్వీయ రచనలకైతే హామీ పత్రం తప్పనిసరన్నారు. సేకరణ కథకు మూల కథ రచయిత వివరాలు తెలియజేయాలన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు ఎవరైనా పాల్గొనవచ్చున్నారు. ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. కథారచనల కోసం పోటీలో పాల్గొనే విద్యార్థిని, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ కు నవంబర్ 30 వరకు గడువుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ డిసెంబర్ 1 ఆదివారం జరిగే పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, మాధవి, ప్రసూన, ప్రసాద్, చింతలూరు ఎంపిపి పాఠశాల హెచ్ఎం వి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

30,1 తేదీల్లో సైక్లింగ్ క్రీడాకారుల ఎంపికలు

ప్రజాశక్తి - అమలాపురం

సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోరిక మేరకు ఎపి క్రీడా ప్రాధికార పర్యవేక్షణలో ఈ నెల 30, వచ్చే నెల 1న 'గుడ్‌రోల్' హైస్కూల్, మందడం విలేజ్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా నందు ఎపి. అంతర్ జిల్లాల ఎంపికలు నిర్వహిస్తారని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పి. సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పైన తెలిపిన సైక్లింగ్ క్రీడ పోటీల ఎంపికల్లో పాల్గొనుటకు ఆశక్తి గల సైక్లింగ్ క్రీడాకారులు వారి సైక్లింగ్ ఎక్విప్మెంట్‌తో సహా పై తెలిపిన చిరునామాలో ఈనెల 30న రిపోర్ట్ చేయాలని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో ఎంపిక కాబడిన సైక్లింగ్ క్రీడాకారులు డిసెంబర్ 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పూరి ఒడిశా రాష్ట్రం నందు నిర్వహించు 29వ జాతీయ సైక్లింగ్ చాంపి యన్షిప్‌కు పంపబడతారన్నారు. వివరాల కొరకు వి.వెంకటరావు సైక్లింగ్ కోచ్, డిఎస్ఎ గుంటూరు - 9849379932, ఎస్.శివ రెడ్డి, అథ్లటిక్స్ కోచ్ డిఎస్ఎ. గుంటూరు -9703092077 నెంబర్లలో సంప్రదించవచ్చున్నారు.

ఎంఎల్‌ఎ గిడ్డికి టిడిపి నాయకుల అభినందన

ప్రజాశక్తి - అయినవిల్లి

పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల సభ్యునిగా నియమించింది. ఈ సందర్భంగా పలువురు రాష్ట్ర టిడిపి నాయకులు బుధవారం పి.గన్నవరం ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయంలో ఆయనను సత్కరించి అభినందనలు తెలియజేశారు. జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటుకు, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పనకు ఎంఎల్‌ఎ గిడ్డి కృషి చేయాలని నాయకులు కోరారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాష్ట్ర టిడిపి మానవ వనరుల అభివృద్ధి కమిటీ సభ్యుడు దళిత రత్న నేదునూరి వీర్రాజు, రాష్ట్ర టిడిపి ఎస్‌సి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి చిన్నం బాలవిజయరావు, సర్పంచ్ జల్లి బాలరాజు, పోతుకుర్రు మాజీ సర్పంచ్ గుమ్మళ్ళ శ్రీనివాస సాగర్, అయినవిల్లి మండల టిడిపి ఎస్‌సిసెల్ అధ్యక్షులు మోర్త వీరవెంకటసత్యనారాయణ అభినందనలు తెలిపారు.

నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశం

మండపేట : స్థానిక పెద్ద కాలువ వంతెన వద్ద ఉన్న క్రీస్తు మహిమ ఆవరణం చర్చిలో బుధవారం రాత్రి సంగీత పాల్ అధ్యక్షతన నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఫౌండర్ ప్రెసిడెంట్ శ్యామ్ పాల్, నార్త్ ఈస్ట్ ఇంచార్జ్ నంద కుమార్ గురుంగ,పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ పాల్ మాట్లాడుతూ ఈ సంస్థ దేశంలోని 28 రాష్ట్రాలలో నడపబడుతుందన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ బిషప్ సంజయ్ ఆనంద్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బ్యుల, ప్రశాంత్ కుమార్ బత్తుల తదితరులు పాల్గొన్నారు.

85 శాతం అపార్ నమోదు పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో అపార్ 85 శాతం పూర్తయిందని ఎంపిడిఒ శ్రీలలిత అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఇఒ విఆర్‌కె.చౌదరి అధ్యక్షతన వివిధ పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకూ 85 శాతం అపార్ నమోదు పూర్తికాగా, మిగిలిన 15 శాతం త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. ఎంఇఒ చౌదరి మాట్లాడుతూ డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగు మండల పరిధిలోని 79 పాఠశాలల్లో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్ఎ-1, ఎఫ్ ఎ-2 ల ప్రోగ్రెసివ్ రిపోర్టులు చదివి వినిపిస్తారన్నారు. ఈ కార్యక్రమాలన్నీ విజయవంతంగా నిర్వహించేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలన్నారు.

అత్యవసర సేవలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమ లులో ఉన్నందున అధికారులంతా ప్రజలకు అవసరమైన అత్యవసర సేవలపై దృష్టి సారించాలని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున అధికా రులు ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిం చారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె.సత్య నారాయణ, జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, వైస్ ఎంపిపిలు కొపనాతి లలిత, దూలిపుడి నాగేంద్రప్రసాద్, ఎంపిటిసి సభ్యులు నందికొల్ల శ్రీదేవి, కిరణ్‌కుమారి, చిట్టూరి లలితపద్మ, గుత్తుల శ్రీనివాస్, యర్రంనీడి అప్పారావు, గర్రె సాయిలక్ష్మి, దంగేటి సూరిబాబు, బల్ల సంధ్యారాణి, రచ్చ ముత్యాలు, ఎఒ ప్రశాంతి, ఇరిగేషన్ ఎఇ అనూష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల తహశీల్దార్ ఎంవి. సుబ్బలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రైతులు డిసెంబర్ 1 వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని, మత్స్యకారులు తుఫాను ప్రభావం తగ్గే వరకు గోదావరి మరియు సముద్రం పై వేటకు వెళ్లరాదని సూచించారు. ఇప్పటికే కోతలు కోసిన రైతులు ఒబ్బిడి చేసిన వరి ధాన్యమును బద్రపరుచుకొను ఏర్పాట్లు చేసుకొవాలని కోరారు. ఎటువంటి విపత్తు తలెత్తినా ఎదుర్కొనేందుకు అధికారులు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని సూచించారు.

రైతులకు అగాహన కల్పించాలి

ప్రజాశక్తి - అల్లవరం

తుపాను భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో గ్రామాల్లో వరి రైతులను అప్రమత్తం చేయాలని, వరి కోతలు కోయాని స్టాండింగ్ క్రాప్‌ను డిసెంబర్ 2 తర్వాత కోసేలా అవగాహన కల్పించాలని ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ ఆదేశించారు. అల్లవరం ఎంపిడిఓ కార్యాలయంలో ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో ఎంపిడిఒ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు .ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆరబెట్టిన ధాన్యం రైస్‌మిల్లుకు తరలించేలా వ్యవసాయ, రెవెన్యూ, సహకార శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ మండలంలో ఒక్క రైతు కూడా తుపాను కారణంగా నష్ట పోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని రైతులకు అన్ని విధాలా ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉందనే భరోసా కల్పించాలని సూచించారు .ఈ సమావేశంలో ఎపిఒ శ్రీను బాబు, టిఎ అనిల్ , ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మోటారు వాహనాలను మైనర్లు నడపరాదు

1ఉండ్రాజవరం : మైనర్లు మోటారు వాహనాలు నడిపితే చట్ట ప్రకారం తల్లిదండ్రులకు శిక్షలు విధిస్తారని ఉండ్రాజవరం ఎస్ఐ కొప్పిశెట్టి రామకృష్ణ హెచ్చరించారు. మండలంలో తరచూ ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక తనిఖీల్లో పోలీస్ అధికారులు అటువంటి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఒకసారి పట్టుబడితే అవగాహన కల్పిస్తామని, మరోసారి పట్టుబడితే జరిమానాతో పాటు శిక్ష కూడా ఉంటుందన్నారు. ఇటీవల మట్టి, పెంట, ధాన్యం, ఇసుక తదితరాలు తోలుకెళ్లే ట్రాక్టర్లకు మైనర్లను డ్రైవర్లుగా నియమిస్తున్నట్టు గమనించామని, వారికి అవగాహన కల్పించామని తెలిపారు.

టిడ్కో ఇళ్లు ఇవ్వకుండానే బ్యాంకర్ల ఇఎంఐ వసూలు

నిడదవోలు : నిడదవోలులో తీరుగూడెంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు అందించకుండానే వారి నుంచి బ్యాంకర్స్ ఇఎంఐ కట్ చేసుకోవటం అన్యాయమని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు, టిడ్కో ఇళ్ల వద్ద ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. లబ్ధిదారులు నిరుపేదలు చిన్న షాపుల్లో మాల్స్‌లో పని చేసుకుంటున్నారని, నెల జీతాలు బ్యాంక్ అకౌంట్‌లో వేసిన వెంటనే బ్యాంకర్స్ ఇఎంఐ కట్ చేస్తున్నారని తెలిపారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మంత్రి కందుల దుర్గేష్ జోక్యం చేసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలని, లేకుంటే 1200 మంది లబ్ధిదారులతో నిరసన కార్యక్రమం చేపడతామని రాంబాబు అన్నారు.

పెద్దాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ

పెద్దాపురం : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఐసిడిఎస్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ జరిగిన ఈ ర్యాలీలో ఎంపిడిఒ శ్రీలలిత, సిడిపిఒ జి.ఉష, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాల అనర్థాలపై విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. మారుమూల గ్రామంలో కూడా బాల్యవివాహాలు జరగకుండా నిరోధించాలన్నారు.

CHANGE OF NAME

I, DINTAKURTHY NARAYANA, S/o. CHINA THIMMAYYA, D.No. 9-1-14, Water Works Veedhi, Vinayaka Temple, Rajahmundry, Rajahmundry Urban, E.G.District, A.P. I have changed my name from **DENTAKURTHI NARAYANA RAO** (Old Name) to **DINTAKURTHY NARAYANA** (New Name). Hence forth Iam being called **DINTAKURTHY NARAYANA,** S/o. China Thimmayya, for all purpose.

డిశ్చార్జ్ బుక్ పడిపోయినది

సెవల జయరావు అను నేను ఈ నెల అనగా ది. 21-11-2024వ తేదీన ఆటోలో ప్రయాణిస్తూ అల్లవరం నందు 6891556 సర్వీసు నెంబరు గల నా యొక్క డిశ్చార్జ్ బుక్ పోగొట్టుకొనుట జరిగింది. అది ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

S.JAYARAO (Ex- Army),
D-NO-3-57, THUMMALAPALLI (Post),
BENDAMURLANKA,
Dr. B.R.AMBEDKAR KONASEEMA
DISTRICT, PIN-533 210.
Cell : 9866164374

In the Court of the VIIth Additional Junior Civil Judge at Kakinada
O.S. No. 385/2022

Between:
Kovvuri Subba Reddy ...*Plaintiff*
AND
Sathi Srinivas Sudheer Reddy and Another ...*Defendants*

To:
D-1: Sathi Srinivas Sudheer Reddy, S/o. Lakshmana Reddy, Occ: Special Deputy Tahsildar, O/o. Office the Godavari Urban Development Authority (GUDA), NFCL Road, Kakinada. R/o. D.No. 68-10-14/1, Saraswathi Marg, Near Ideal College, Vidyuth Nagar, Kakinada, Kakinada District.

D-2: Sathi Naga Lakshmi, W/o. Srinivas Sudheer Reddy, R/o. D.No. 68-10-14/1, Saraswathi Marg, Near Ideal College, Vidyuth Nagar, Kakinada, Kakinada District.

పై నెంబరు దావాలో 1వ మరియు 2వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 06-12-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

CH.KANAKA CHARI, Advocate
D.No. 3-164, Gaigolupadu,
Kakinada, Cell: 9948599037

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కాకినాడ
M.V.O.P. 4/2023

Between:
తోలెం కన్నయమ్మ & వగైరా -పిటిషనర్స్
AND
యడ్ల నాగ సత్తిబాబు & వగైరా -రెస్పాండెంట్స్

R-2: మాకిరెడ్డి అప్పలనాయుడు, S/o. కన్నబాబు, C/o. యడ్ల నాగ సత్తిబాబు, పాత కొట్టాం గ్రామం, కోటనందూరు (మండలం), కాకినాడ జిల్లా.
ట్రాక్టర్ యజమాని, బేరింగ్ నం. AP 31 CR 3683
ట్రాయిలర్ యజమాని,బేరింగ్ నెం. AP 31 TM 0775

R-4: తాళ్లై దుర్గాదేవి, D/o. గురువులు, వయస్సు 32 సం॥లు, డో.నెం. 58-11-13, సంజీవనగర్, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా.

పై నంబరు పిటీషనులో 2వ రెస్పాండెంట్ మరియు 4వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు సమన్లు అమలు నిమిత్తం **ది. 13-12-2024వ తేదీన వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(By Court Order)
K.V.BHADRA RAO
K.SRIVANI
K.S.CHANDRA RAO
Advocates, Kakinada
Cell: 94401 77063